

# నేను భరించలేను

సంక్రాంతి సంచిక విజయభాను - 1968

---

**నలుగురు పెద్దల సాక్షిగా భార్యను చేసుకున్న.... అమ్మాయిని... భర్త భరించాల్సిన అవసరం లేదు... బాగుచేసుకుంటే... ఆమె అతనికి వరం... పారేసుకుంటే ఆమె అతనికి శాపం.**

**- జయప్రద**

---

"శ్యామమోహన్ ఇంట్లో ఉన్నాడా?" కర్టెను తొలగించివచ్చి వాకిట్లో నిల్చున్న ఆమెను చూచి మొదటి మెట్టుమీదనే ఆగిపోయి అడిగాడు కృష్ణమూర్తి.

"రండి. కూర్చోండి ఇప్పుడే పిలుస్తాను."

లోపలికెళ్తున్న ఆమెను చూస్తూ అనుకున్నాడు కృష్ణమూర్తి.

"ఎవరీమె?"

మూడు నిమిషాలలో తిరిగివచ్చి అంది. "మేడమీద గదిలో లేరు. బహుశ వాళ్ళ ఆఫీసర్ ఇంటికెళ్ళారేమో ఫోన్ చేస్తాను." స్వచ్ఛమయిన ఆమె ఉచ్చారణ, ఠీవి,

సుకుమారము, సమపాళ్ళలో కలసిన ఆమె నడక అతడిని ముగ్ధుడ్ని చేశాయి. కానీ అవే అతడ్ని భయపెట్టి అంతదూరంలో నిలబెట్టాయి.

లోపలనుండి మాటలు విన్పించాయి.

"శ్యామూ! వచ్చెయ్యి. ఇంటికి అతిథి వచ్చారు." ఫోన్ పెట్టేసిన శబ్దం విన వచ్చింది. 'శ్యామూ.....' మనసులోనే గొణుక్కున్నాడతను. 'శ్యామ్‌మోహన్‌కు ఈమె ఏమౌతుంది?' ఆమె తిరిగివచ్చి అతనికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ అంది.

"ఉన్నారు. వస్తున్నారు" అతను ఆమెవైపు కళ్ళప్పగించి చూస్తున్నాడు. ఎవరి పోలికలో వున్నాయి ఆమెలో.

ఒక్క నిముషం తర్వాత అంది ఆమె "మీరు...." మధ్యలోనే ఆపి చెప్పాడతను.

"మీరు నన్ను చూసివుండరు. నా పేరు కృష్ణమూర్తి. మోహన్ స్నేహితుడ్ని. చాలా కాలమయింది వచ్చి. మాధవిని తీసుకెళ్దామని వచ్చాను."

"ఆహాఁ"

"మాధవి మీకు తెలుసా?"

తెలుసునన్నట్టు నవ్విందామె.

"ఎలా వుంది?" భయంతో కూడిన ఆతృత వుంది ఆ స్వరంలో.

"ఎలా వుండాలనుకుంటున్నారు?" మెత్తగా నవ్వింది.

"క్షేమంగా వుందనుకుంటాను" గొణిగాడు.

"మీ స్నేహితుడిమీద మీకు పూర్తి విశ్వాసముందిగా?"

"ఆఁ"

"అయితే మీకా అనుమానామే రాకూడదసలు" అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అంది.

ఈమారు గొణగడానికి కూడా సాహసం లేకపోయిందతనికి. ఆ చూపులకు తట్టుకోలేక తల దించుకున్నాడు.

'ఈమె కెందుకీ అనవసర ప్రసంగం' ఆ అపరిచిత వ్యక్తిమీద మనసులోనే కోపప్డ్డాడు. ఒక సామాన్యమైన స్త్రీ ప్రశ్నకు జవాబు చెప్పలేని అసహాయతలో నుండి పుట్టిన అర్థంలేని కోపమది.

ఆమె లేచి లోపలికెళ్ళింది. ఆమె వెళ్ళగానే ఆ ముఖాన్ని ఒక్క క్షణం తల్చు కున్నాడు కృష్ణమూర్తి. గుండ్రని తెల్లటి ముఖం, నల్లటి సోగకళ్ళు, దట్టమయిన

కనురెప్పలు, వెడల్పయిన నుదురు, తీర్చిదిద్దిన ముక్కు, నవ్వుతున్న పెదాలు, ఆ ముఖంలో నిండుగా పవిత్రత, ఆ కళ్ళల్లో తీవ్రమయిన కళ, ప్రతివారిని పసిపిల్లలను చేయగల అసమాన్యమయిన నవ్వు ఆమెది.

ఒక్కక్షణం అనుకున్నాడు కృష్ణమూర్తి. 'మోహన్ ఈమెను ఎలా భరిస్తున్నాడు?' అతడు స్నేహితుడిమీద జాలిపడే లోపలే కాఫీ కప్పుతో తిరిగొచ్చిందామె.

"తీసుకోండి."

కప్పు అందుకున్నప్పుడు ఆమె వేళ్ళ స్పర్శకు అదిరిపడ్డాడతను. ఆమె అదేమీ పట్టించుకోలేదు. కళ్ళు దించుకుని గడ గడ కాఫీత్రాగి కప్పు ఇచ్చాడు. ఆమె లోపలి కెళ్ళింది. ఆమె తలపులనుండి బయట పడకముందే శ్యామ్‌మోహన్ వచ్చాడు.

"అరె! నువ్వా? అతిథి అంటే ఎవరో అనుకున్నాను. ఈనాటికి నీ బుద్ధి మారి నా నిరీక్షణ ఫలించిందన్నమాట. నమ్మలేకుండా ఉన్నాను." స్నేహితుడిని కావలించు కున్నంత పనిచేశాడు మోహన్.

"ఎవరి నిరీక్షణ?" ఆ విచిత్ర వ్యక్తిని మరచిపోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

"ఎవరిదయ్యుంటుంది?" అని నవ్వాడు మోహన్. కృష్ణమూర్తి హృదయం నిండా ఏదో తీగలా ప్రాకినట్లనిపించింది. ఈ అనుభూతి చాలా క్రొత్తది అతనికి. ఎదురుగా శూన్యంలో అమాయకమయిన మాధవి తాలూకు రెండుకళ్ళు కన్పించాయతనికి.

"నా భారాన్నుండి నిన్ను తప్పించననే అనుకున్నావా మోహన్!"

"నువ్వు ఆ భారాన్ని నాకు అప్పగించి ఎన్నాళ్ళయింది కృష్ణా!" ఎదురు ప్రశ్న వేశాడు మోహన్.

"ఏడు సంవత్సరాలు."

"ఆ కాలం చాలా గొప్పది. పైగా విలువైంది భయ్యా."

"ఆ విషయం నాకు కొన్నాళ్ళ క్రితమే తెలిసింది" అతని గొంతు సన్నగా వణికింది. నేల చూపులు చూస్తూ చెప్పుకుపోసాగాడు కృష్ణమూర్తి.

"ఆనాడు ఇక్కడనుండి పారిపోయాక చాలా శాంతిగా అన్పించింది. మరే ఆలోచనా రాలేదపుడు. ఒంటరితనంలో ఎంతో హాయిని ఊహించుకున్నాను. అలాగే గడచింది కాలం. కాని మోహన్!... రెండు సంవత్సరాలుగా ఏదో అశాంతి నన్ను వెంటాడ

సాగింది. దాని స్వరూపం ఇన్నాళ్ళకుగాని తెలియలేదు నాకు. ఆనాడు మూర్ఖంగా ప్రవర్తించినందుకు నా మనస్సే నన్ను హింసిస్తోంది. నీనుండైతే పారిపోగలిగానుగాని ఈ మనసుకు దూరంగా పారిపోలేకపోయాను. నిజం చెప్తున్నాను. మాధవి నా మాధవే నాకు కావాలనిపిస్తోందిరా మోహన్. తెలివితేటలు, ఆడంబరాలు, నాగరికత నాకొద్దు. ఇంత శాంతి నివ్వగలిగే నీడ కావాలి. నాకు తెలుసు అమాయకురాలు అయిన మాధవి నాకు దానిని ఇవ్వగలదని. అందుకే నీ దగ్గర దాచిన విలువైన వస్తువును తిరిగి పొందుదామని పరుగెట్టుకొచ్చాను" ఆయాసంతో ఆగాడతను.

"శ్యామూ! ఇంతసేపా? ఆయన వచ్చి చాలా సేపయింది" వాకిట్లో నిల్చుని కృష్ణమూర్తివైపు చూస్తూ అంది ఆమె. మోహన్ నవ్వి ఆమెను దగ్గరకు రమ్మన్నట్టు సంజ్ఞ చేసాడు. అతని ప్రక్కగా వచ్చి కూర్చుందామె.

"ఈయన...." పరిచయం చేయబోయాడు.

"తెలుసు" అంది కళ్ళతో నవ్వుతూ.

"ఏం తెలుసు?"

"అంతా తెలుసు శ్యామూ. నువ్వు చెప్పాల్సింది ఇంకేమీ లేదు" అని లేచి "ఇప్పుడే వస్తాను నీకు కాఫీ పట్టుకుని" అని కృష్ణమూర్తివైపు సెలవడుగుతున్నట్లు చూచి వెళ్ళిపోయింది.

అసహాయంగా స్నేహితుడివైపు చూసి నవ్వుతూ అన్నాడు మోహన్. "ఎప్పుడూ ఇంతేరా కృష్ణా. అన్నీ ముందే తెలుసుకుంటుంది. నన్ను చెప్పనివ్వదు."

కొద్దిగా పెద్దగా నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి. "పోనీలే. నా గురించి ఆమెకు తెలుసు. ఆమె గురించి నాకు తెలియదు కదా? చెప్పు ఎవరీమె?" 'ఈమె మోహన్ భార్య కాకపోతే బాగుండును' మనసులో కోరుకున్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు మోహన్.

"నువ్వు గుర్తుపట్టలేనంతగా మారిపోయిందా మాధవి" సన్నగా బాధగా అన్నాడు.

"మాధవి... ఈమె... నువ్వు నిజమే చెప్తున్నావా మోహన్!" అతని గొంతు కంపించింది. కళ్ళు పెద్దవయ్యాయి. కనుపాపలు వేగంగా చలించాయి.

"అవును కృష్ణా! నువ్వు నమ్మలేకుండా వున్నావా?" మోహన్‌కు అంతా ఆశ్చర్యంగా వుంది. వాళ్ళిద్దరు ఒకరినొకరు గుర్తుపట్టే వుంటారని నమ్మాడు.

"ఈ మార్పు... ఈ మార్పు..." సన్నగా గొణుక్కున్నాడు కృష్ణమూర్తి.

"నువ్వు కోరిన మార్పు. ఇంత కాలానికి వచ్చింది." స్నేహితునివైపు చూడకుండా అన్నాడు మోహన్.

"కానీ.... కానీ..."

స్నేహితుడి భయానికి అర్థం తెలియక విస్తుపోయాడతను.

"కృష్ణా!" భుజం తట్టాడు. "ఆమెను పిలవనా?"

"ఆఁ"

మోహన్ లేచి లోపల కెళ్ళాడు. అచేతనుడై పోయాడు కృష్ణ.

"ఈమె... మాధవి... ఎలా నమ్మడం? అజ్ఞానురాలూ, అమాయకురాలూ అయిన ఆనాటి మాధవిని అతి విజ్ఞానవంతురాలూ, సాహసి అయిన ఈ మాధవితో పోల్చు కోవటం- ఈ నిజాన్ని ఎలా నమ్మడం?"

తొందర తొందరగా ఒక్కొక్క పరదానే తొలగించబడి ఏడు సంవత్సరాల వెనక్కు మళ్ళింది మనసు. మాధవిని పిలవడానికి వెళ్ళిన మోహన్ వంటింటి కివతలగా నిల్చుని అదే వూహిస్తున్నాడు.

* * * * *

సరిగ్గా ఏడు సంవత్సరాల క్రితం కృష్ణమూర్తి ముఖంలో అసహనం స్పష్టంగా కన్పించింది.

"ఎందుకలా వున్నావు?" అడిగాడు మోహన్.

"ఈమె నాకిష్టం లేదు" కోపంగా అన్నాడు కృష్ణ.

ఆ విషయం పెళ్ళి కాకముందు నీకు తెలియదా?"

"తెలుసు."

"మరెందు కంగీకరించినట్టు?"

"చుట్టూ మనుష్యుల కొరకు" కసిగా చెప్పాడు.

ఒక్కక్షణం మౌనం తర్వాత అన్నాడు మోహన్, "కానీ, కృష్ణా! ఆ మనుష్యులు

నిన్నిప్పుడీ అశాంతినుండి పైకి లాగలేరు. పైగా ఆ పసిపిల్లకు ఘోరమైన అన్యాయమే జరిగింది."

కృష్ణమూర్తి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

* * * * *

కెమెరాలోనుండి 'రీల్' తీసి టేబిల్‌మీద పెడ్తున్నాడు. "ఏమిటది?" సన్నగా కుతూహలంగా అడిగింది గదిలో ఒక మూలగా చాపవేసుకుని కూర్చుని వున్న పెళ్ళికూతురు మాధవి. పద్నాలుగు సంవత్సరాలయినా పూర్తిగా నిండని ఆ ముఖంలో పసితనం కొట్టవచ్చినట్టు కన్పించింది.

మోహన్ చెప్పాడు, 'ఇందులో మీ ఇద్దరి ఫొటోలుంటాయి."

"ఫొటో అంటే?"

"మీ ఇద్దరి బొమ్మలు" నవ్వుతూ విడమర్చి చెప్పాడు. ఆమె కళ్ళు మెరిసాయి. సంతృప్తిగా నవ్వుకుని, ఆ విషయమే కృష్ణకు చెప్పి, ఆ గదిలోకి లాక్కొచ్చాడు మోహన్... కానీ, ఆ సంతోషం క్షణంలో మాయమయింది. మాధవి ఆ రీలును పూర్తిగా విప్పేసి చూస్తోంది. ఇద్దరిలో మొదట కృష్ణే తేరుకున్నాడు.

"ఛీ! ఛీ! పల్లెటూరి మొద్దు. తెలియకపోతే తెలియనట్టు ఊర్కోవాలి. నిన్ను తెచ్చి నా కంటగట్టారు" విసురుగా వెళ్ళి రీలు లాక్కోబోయాడు.

"కృష్ణా!" మోహన్ కళ్ళు అతన్ని వారించాయి. విసురుగా అక్కడనుండి వెళ్ళిపోయాడు కృష్ణ.

మాధవి కళ్ళనుండి ముత్యాల్లాటి బిందువులు చెంపలమీదుగా జారిపోతున్నాయి.

ఫొటోస్ ఎక్స్‌పోజ్ అయి వ్యర్థమయిపోయాయే అనే బాధ అణు మాత్రం కూడా మిగలలేదు మోహన్‌కు. ఆమెను దగ్గరకు తీసుకుని బుజ్జగించి, కన్నీళ్ళు తుడవాలనిపించింది. కానీ వయస్సులో చిన్నదే అయినా, పెళ్ళికూతురు స్థానంలో వున్న ఆ పసిపిల్లను తాకడానికి అతని సంస్కారం ఒప్పుకోలేదు.

"చూడు మాధవీ! కృష్ణ మనసేం బాగలేదు. బాధపడకు. నువ్వు చేసిన పని వల్ల నష్టమేమీ కలగలేదు. కన్నీళ్ళు తుడుచుకో" గబ గబ చెప్పేసి కృష్ణ ననుసరించాడు. మాధవి కళ్ళల్లో కృతజ్ఞతను అతను గమనించనేలేదు.

తలను రెండు చేతులతో పట్టుకుని కూర్చొనున్న కృష్ణ, మోహన్ అడుగుల చప్పుడుకి తలెత్తి అసహాయంగా చూస్తూ అన్నాడు.

"ఎలారా మోహన్ ఈ పిల్లను భరించడం?"

మోహన్ కొద్దిగా నవ్వాడు.

"పిచ్చివాడిలా ఏమిటి కృష్ణా! పసిపిల్ల, నువ్వు ఎలా మలచుకుంటే అలా తయారవ్వగలదు."

"నాకు నమ్మకం లేదు" నిట్టూర్చాడు.

"చూడు. రెండు నెలలపాటు నాతో వచ్చి వుండండి. బొంబాయి నగరం అంతా చూపుతాను మాధవికి. తనే మారుతుంది. నీ చదువుకి ఇంతలో భంగం రాదులే!" స్నేహితుడి వైపు సానుభూతిగా చూస్తూ చెప్పాడు మోహన్.

కొంతసేపయ్యాక నీరసంగా అన్నాడు కృష్ణ. "సరే నీ ఇష్టం" పెళ్ళి తంతు పూర్తయ్యాక భార్యను తీసుకుని బాంబే ప్రయాణమయ్యాడు కృష్ణమూర్తి.

బొంబాయిలో ఆమె మారలేదు. సరికదా, ఆ ప్యాషన్లకు, సభ్య సమాజపు రీతుల్ని అసహ్యించుకోవడం ప్రారంభించింది. తన స్నేహితులను, స్నేహితురాళ్ళను ఇంటికి తీసుకువస్తే, వాళ్ళలో వుండే తప్పొప్పులను అమాయకంగా ముఖం మీద అడగగలిగే సాహసం ఆ పల్లె పడుచుకు వుందిగాని దానిని సహించగలిగే ఓర్పే అతనిలో లేకపోయింది. తన భార్య తన అంతస్థులో నిలబడి తనతో చెయ్యి కలపాలని ఆశ పడ్డాడతను. కానీ, ఆమె నాగరికత మెట్లన్నీ ఎక్కి అతనిని చేరుకోవడానికి ఆసక్తి చూపలేకపోయింది. అతను ఆమె నిర్లక్ష్యాన్ని సర్దుకోలేకపోయాడు. తన భార్యకు ఒక వ్యక్తిత్వముండాలనీ అది సమాజంలో బయట పడాలనీ కోరుకున్నాడు. కానీ పల్లెటూరిలో పుట్టి పెరిగిన మాధవికి భర్తమాట వినడమే తెలుసుగాని, అతనిని ఎదిరించి తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడం తెలియదు. ఆమె విశాలమయిన కళ్ళలో చిలిపితనాన్ని, మంకుతనాన్ని చూడాలని ఆశపడ్డ అతనికి ఆ కళ్ళల్లో దీనత్వము భయమూ కాసిన్ని కన్నీళ్ళు తప్ప మరేమీ కన్పించలేదు.

అతనిని అర్థం చేసుకోవడానికి ఆమెకు వయస్సు చాలలేదు. ఆమె పెరిగేవరకూ ఆగడానికి అతనికి ఓర్పు లేదు. ఆ పసిపిల్లను భార్యగా భావించడానికి చాలా ప్రయత్నించాడు. కాని అందులో పూర్తిగా ఓడిపోయాడు. అందుకే అతను ఆ రోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా మనశ్శాంతిని వెతుక్కుంటూ పారిపోయాడు.

మర్నాడు మోహన్‌కు అతను మిగిల్చి వెళ్ళింది. బిక్కుబిక్కుమని చూచే మాధవి, ఒక చిన్న ఉత్తరమూను.

"మోహన్! ఈ ద్వంద్వ మనస్తత్వాల మధ్య మెసలలేకుండా వున్నాను. మాధవిని నీమీద వదిలి వెళ్ళిపోతున్నాను. ఇంకెవ్వరికీ అప్పజెప్పకు. ఆమెను మలచి నాగరికురాలిగా చెయ్యి. మరలా వచ్చి ఆమెను స్వీకరిస్తాను. నీమీద నాకా విశ్వాస ముంది..."

కృష్ణ ఒప్పజెప్పిపోయిన బాధ్యతాభారం చాలా గొప్పదీ, క్లిష్టమైనదీను. ఏమీ తెలియని ఒక స్త్రీ, అన్నీ తెలిసిన ఒక పురుషుడు ఒకే ఇంట్లో ఎవరు ఎప్పుడు ఎందుకు బ ధ్యులవుతారో తెలియదు. స్త్రీ, పురుష శబ్దాలు చాల ఆకర్షణీయమయినవి. ఆ లోభనీయమయిన ఆకర్షణనుండి తప్పించుకోవడానికి అతను ఆ రోజే ప్రయత్నించి గెలిచాడు. కృష్ణ కొరకు రెండురోజులు ఏడ్చిన మాధవి మూడవనాడు మర్చిపోయింది. శ్యామూ, శ్యామూ అంటూ అతని వెంట యధా ప్రకారం స్వేచ్ఛగా తిరగసాగింది. కృష్ణ పరారీ కృష్ణ ఇంట్లోనూ, మాధవి ఇంటిలోనూ కూడా చాలా అలజడి రేపింది. మాధవి పరాయి వాడి ఇంటిలో వుండటానికి ఎవ్వరూ అంగీకరించలేదు. మాధవి తటస్థంగా వుండిపోయింది. స్నేహితుడి మాటకొరకు అందరితో మోహన్ ఒక్కడే యుద్ధం చేయాల్సి వచ్చింది. మనశ్శాంతి వెతుక్కుంటూవెళ్ళిన కృష్ణ తన స్నేహితుడికి మనశ్శాంతి లేకుండా చేసి వెళ్ళాడు.

మాధవి మంచి చెడ్డల కన్నింటికీ మోహన్ ఒక్కడే బాధ్యుడయ్యాడు. అందుకు అతను బాధపడలేదు. ఆమెను మార్చి స్నేహితుడికి ఒప్పజెప్పాలి. అదొక్కటే అతని ధ్యేయం. తన వెంట పట్టణమంతా తిప్పేవాడు. ఆ మహానగరంలో మనసుకు నచ్చిన వన్నీ ఆమెకు చూపేవాడు. ఫ్యాషన్ల గురించి అతను బోధిస్తున్నప్పుడు ఆసక్తి కనపరచి శ్రద్ధగా వినేది. మోహన్ ఆమెను చాలామందితో పరిచయం చేశాడు. దాని మూలంగా వచ్చిన అవమానాలన్నింటినీ నిశ్శబ్దంగా భరించాడు. ఒకరోజు ఆమె మారుతున్నదని తెలిసినరోజు ఆ అవమానాలనన్నిటినీ మర్చిపోయి మనసారా ఆనందించాడు.

ఆమెకంటూ కొన్ని భావాలు ఏర్పడుతున్నాయి. కానీ అవి గజిబిజిగా చేరి ఆఖరుకు అర్థం లేకుండా పోతున్నాయి. అటువంటప్పుడు ఆమె అతనిని సవాలక్ష ప్రశ్నలు వేసేది. అతను ఓపిగ్గా జవాబిచ్చేవాడు. క్రమేపీ ఒక రీతిలో అర్థం చేసుకోవటం నేర్చుకుంది మాధవి. దానితో స్వంత భావాల మీద "రీసెర్చి" చెయ్యసాగింది. మోహన్

మొదటిలో చెప్పినట్లు ఆమె మేధాశక్తి తీగలా సాగింది. కష్టసుఖాలను అవి ఎంతటివైనా సరే సమంగా భరించటం అలవాటు చేసుకుంది. ఎటువంటి స్పందనయినా, అనుభూతినైనా ఏ వికారమూ లేకుండా తనలో దాచుకుని మెత్తగా నవ్వగలదామె. తన శిష్యురాలు, స్నేహితురాలయిన మాధవి విజ్ఞానం ఒక్కొక్క సమయంలో అతన్ని ముగ్ధుడ్ని గావించేది. ఆమె అంటే తనకు కలిగే ప్రేమభావం నుండి విముక్తుడు గావడానికి చాలా ప్రయత్నించవలసి వచ్చేది. మాధవి మనసు అతనికి తెలీదు. తన స్నేహితుడు ఇక వస్తాడనే నమ్మకమూ లేదు. కానీ....

ఆ రోజు అంతర్హితుడైన స్నేహితుడు తిరిగివచ్చాడు. తన సర్వస్వాన్ని అతని దోసిట్లో పోసి, కళ్ళు మూసుకుని జీవించడం నేర్చుకోవాలి.

గోడనానుకుని ఆలోచిస్తున్న మోహన్ ఉలిక్కిపడ్డాడు.

"శ్యామూ! ఇంత చిన్న విషయానికి అంత ఆలోచనా?" అంది మాధవి.

"లేదు మధూ నేనేం ఆలోచించడం లేదు" నీరసంగా నవ్వాడు.

ఆమె నవ్వింది నమ్మలేనట్టుగా.

అతను కొద్దిసేపయ్యాక అన్నాడు.

"పద మధూ! తయారవ్వు. ఎన్నాళ్ళగానో నిరీక్షిస్తున్నాం. అది ఈనాటికి ఫలించింది. లే సామాను సర్దుకో."

"ఎక్కడికి" నిశ్చలంగా అడిగింది. ఆమె ప్రశ్నకు అతను ఉలిక్కిపడ్డాడు.

తను భయపడినంతా అయింది. పల్లెటూరినుండి ఒక్కమారుగా పట్నవాసపు వాతావరణానికి మారిపొమ్మని అందరూ చేరి బలవంతపెట్టారామెను. విజ్ఞానాన్ని, నాగరికతను రంగరించి నోటినిండుగా పోసి ఆమె గుటక వేయలేదని మొత్తుకుంటున్నా వినకుండా తొందర చేశాడు తను కూడా. దాంతో ఆమె విప్లవాత్మకంగా తయారయింది.

కొంతసేపటికి తేరుకుని ధైర్యం తెచ్చుకుంటూ అన్నాడు మోహన్. "అదేమిటి? క్రొత్తగా అడుగుతున్నావు? కృష్ణ వచ్చాడు నీకొరకు. నీ ఇంటికెళ్ళవుగాని."

మరలా కాతర స్వరాన అంది.

"ఇది నా ఇల్లు కాదా శ్యామూ!"

"కాదనలేదు మధూ కానీ అది... అది నీ స్వంతం."

ఆమె నవ్వింది. ఇంతలోనే గంభీరంగా మారి నిశ్చల స్వరాన అంది.

"అది నా స్వంతం అని నీ విశ్వాసంతో అనను? కనీసం ఆ ఇంటి ముఖద్వారా

న్తైనా నేను చూడలేదే!... ఆ నాలుగు గోడలు నాకేమీ చెప్పలేదే! ఆ ఇల్లు నాదెలా అవుతుంది శ్యామూ."

"కృష్ణ నీ వాడయినప్పుడు కృష్ణ ఇల్లు నీదికాక మరేమవుతుంది?" ఆమెకెలా నచ్చచెప్పాలో అతనికి అర్థం కావడంలేదు.

ఆమె పకపక నవ్వింది.

"కృష్ణ నావాడని ఏమిటి గ్యారంటీ? ఏడు సంవత్సరాల క్రితం కట్టిన పచ్చ తాడేనా?"

"హిందూ సాంప్రదాయం...." గొణిగాడు మోహన్.

"హిందూ సాంప్రదాయం..." నిట్టూర్చిందామె.

"శ్యామూ! ఆ సాంప్రదాయం సత్యమే అయితే ఈ ఏడు సంవత్సరాలు, నా భర్త నుండి నన్నెందుకు ఎడబాటు చేసింది? ఆ విషయాన్నెందుకు అది పట్టించు కోలేదు?"

మోహన్ మాట్లాడలేదు. రెండు నిముషాల మౌనం తర్వాత ఆమె అంది.

"పోనీ, ఇది చెప్పు శ్యామూ! నన్ను పూర్తిగా వదులుకుని నువ్వు వుండగలవా?" అతను తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"ఆడపిల్లల్ని, వాళ్ళెంత ప్రీతిపాత్రులయినా సరే ఎప్పుడో ఒకప్పుడు వదులుకోక తప్పదు. ఆ క్షణాన అదెంత బాధయినా సరే భరించి తీరాల్సిందే" అతని గొంతులో గాజు పలకలు బ్రద్దలయ్యాయి.

"అదే నీ వుద్దేశ్యమయితే వెళ్ళమని నువ్వు నన్నెందుకు శాసించవు?" కత్తిమొన లాంటి ఆమె చూపులను తట్టుకోలేక తల దించుకున్నాడతను.

"శ్యామూ! ఆనాడు పసిపిల్లనని, పల్లెటూరిదాన్నని నువ్వు అతనిలా ఏవగించు కోలేదు. ఇప్పుడు అన్నీ తెలిసిన దాన్నని భయపడడం లేదు. నాకు ఎవరయినా ఏమయినా అయితే అది నువ్వు అవుతావు. అది ఎటువంటి బాంధవ్యమయినా సరే నిజం చెప్తున్నాను శ్యామూ! అతని స్మృతి నా హృదయంలో ఏ మూలనా లేదు. నిజాలను నిజాలుగా ఎదిరించలేని ఆ పిరికివాడంటే నాకు వీసమెత్తు కూడా గౌరవం లేదు." అయాసంతో ఒక్కక్షణం ఆగి అంది ఆమె.

"ఒక్క మాట శ్యామూ! నువ్వు ఖచ్చితంగా వెళ్ళమంటే అతని వెంట వెళ్తాను. కానీ భార్యగా మాత్రం కాదు."

"అదేమిటి?" విస్తుపోయాడు.

"నువ్వు నీ స్నేహితుడికిచ్చిన మాటకొరకు నేనీనాడు వెళ్ళక తప్పేట్టు లేదు. అయినా నా కిష్టంలేని వ్యక్తితో నేనెందుకు వెళ్ళాలో అర్థం కావడం లేదు." ఆమె గొంతు సన్నగా వణికింది. మరలా వెంటనే సర్దుకుంటూ అంది.

"నా ప్రియ స్నేహితుడివయిన నీ మనశ్శాంతిని లాక్కోవడంకూడా నా అభిమతం కాదు. అలాగే నీ ఇష్టప్రకారమే వెళ్తాను. కానీ ఒక్క విషయం గుర్తుంచుకో. ఈ గడప దాటేవరకే నీ ఇష్టం. ఆ తర్వాత అతడితోనే వెళతానో మరేం చేస్తానో నువ్వు అడగ కూడదు."

అతను ఆమె నిశ్చయానికి అదిరిపడ్డాడు.

"మధూ... మధూ... అదికాదు నా వుద్దేశ్యం అది కాదు."

ఆమె మాట్లాడలేదు. తల వంచుకుని నిల్చుంది.

"నిన్ను వెళ్ళిపొమ్మని నేనెలా చెప్పగలను? నీ దగ్గర దొరకని శాంతి మరెవ్వరి దగ్గరా దొరకదు నాకు" అతని కళ్ళు ఆర్ద్రమయ్యాయి. ఆమె అతని దగ్గరగా వచ్చి తల మీద చెయ్యి వేసింది. అతనికి ఆ తొలి స్పర్శలో అపరమితమయిన శాంతి లభించింది. ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"నేను ఏడు సంవత్సరాలు నిన్ను ఆదరించాననే కృతజ్ఞతతో ఏదో చేయాలను కోకు. తొందరపడకు మధూ!"

"లేదు శ్యామూ! తొందరపడడంలేదు. కొన్ని సంవత్సరాలుగా నీ భిక్షతో పెట్టిన విజ్ఞానంతో ఆలోచిస్తున్న విషయమే ఇది. నువ్వు ఇంతకాలం నన్ను ఆదుకున్నాననే కృతజ్ఞతతో నేనీనాడు నిన్ను అభిమానించటం ప్రారంభించలేదు. ఏనాడైతే నువ్వు నా అవివేకపు పనికి నన్ను క్షమించి ఓదార్చావో ఆనాడే నా పసి మనస్సులో ఒక బలమైన స్థానాన్ని ఆక్రమించావు నువ్వు. ఇంతకంటే నీకు నేనేం చెప్పేది? ఇది కృతజ్ఞత కాదని ఏ నిదర్శనాలతో నిన్ను నమ్మించేది" నిట్టూర్చిందామె.

"వద్దు వద్దు. నిదర్శనాలక్కరలేదు" తడబడ్డాడతను.

ఆమె చెప్పుకుపోసాగింది. "నీ స్నేహితుడు నన్ను కాదన్నప్పుడు నేను పసిపిల్లను. అతని అదృష్టం. నేనందుకు తల వంచాను. కాని అతని దురదృష్టం అతను కావాలను కునే సమయానికి నేను చాలా ఎదిగిపోయాను."

"అలా అనకు మధూ. నేను చెప్పేది సాంతంగా విను. నన్నర్థం చేసుకో."

ఆమె వెళ్ళబోతున్నదల్లా ఆగి వెనక్కి తిరిగింది. "అలాగే చెప్పు. చెప్పేముందు ఒక్కమాట విను. నిన్ను అర్థం చేసుకోవడంలో మాత్రం నేను పొరపాటు పడలేదు. ఆ ఆత్మ విశ్వాసం నాకుంది. నువ్వు మాత్రం ఆత్మవంచన చేసుకోకు. అదే నే చెప్పేది. అంతకంటే అశాంతి మరొకటుండదు."

అతను మాట్లాడలేదు. తిరిగి ఆమే అంది.

"వెళ్ళు, వెళ్ళు. నీ స్నేహితుడు ఎదురు చూస్తుంటాడు. నీ మనసుకు న్యాయమని తోచింది చెయ్యి."

అతను తిరిగి మాట్లాడేలోపలే ఆమె లోపలికెళ్ళిపోయింది. మెల్లిగా అడుగులో అడుగులేసుకుంటూ స్నేహితుడు కుర్చీ కెదురుగా వచ్చి నిల్చున్నాడు మోహన్. అప్పటికి తన ఊహలనుండి తేరుకున్న కృష్ణ అనుకున్నాడు.

'ఇంత ఎత్తునవున్న ఈమెను భరించడమెలాగ? పల్లెటూరి మొద్దు అని తిట్టించుకున్న ఈమె ఈనాడు అన్నీ తెలుసుకుని ఎదురుగా నిలబడికి భరించలేకపోతున్నాడేమి? ఇంకా పద్నాలుగు సంవత్సరాల పసిపిల్లలాగానే ఊహించుకున్నాడు అర్థం లేకుండా. ఇన్ని సంవత్సరాల తర్వాత మరలా ఆ పసి మనస్సునే కోరుతోంది. నాగరికతతో వేసారిన హృదయం. కానీ తన ఆలోచనలన్నిటినీ తారు మారు చేస్తూ అపూర్వమయిన వ్యక్తిత్వంతో ఎదురుగా నిల్చున్న ఈ మాధవిని భరించేశక్తి లేదనిపిస్తోంది. చిత్రంగా.... అంత విశాలత్వం తనలో లేదు. తనలో ఇంకా పురుషుడు చావలేదు. ఏమిటి దారి? అసలు ఇన్ని ఏళ్ళ తర్వాత ఎందుకొచ్చినట్టు? దొరికిన కొద్ది శాంతిని పాడు చేసుకోవడానికి కాకపోతే.....

'ఇక్కడనుండి పారిపోవాలి... ఆమెకు దూరంగా ఎక్కడికైనా సరే....'

కుర్చీలోనుండి లేచిన కృష్ణ భుజంమీద చెయ్యివేసి "భయ్యా! ఆమె నీతో రానంటోంది" అన్నాడు మోహన్ తలవంచుకుని.

కృష్ణ కనురెప్పలెత్తి స్నేహితుడివైపు శూన్యదృక్కుల బరిపాడు.

"నామీద విశ్వాసముంచు. ఇందులో నా దోషం ఏమీ లేదు" వేడుకుంటున్నట్టు స్నేహితుడి కళ్ళల్లోకి చూసాడు మోహన్.

"మోహన్! నీమీద నాకు పూర్తి విశ్వాసముంది. కాబట్టే నిశ్చింతగా ఏదు

సంవత్సరాలు గడిపాను. ఇప్పుడింకా మిగిలిన విశ్వాసంతో నిన్నొకటి అర్థిస్తున్నాను. కాదనకు. మాధవి భారం నువ్వే మొయ్యి. అంత విజ్ఞానవతిని నేను భరించలేకున్నాను. నేను పిరికివాడినిరా మోహన్. ఐయామ్ సారీ. నేనిక్కడ వుండలేను. ఏమనుకోకు వస్తాను" జవాబుకైనా ఆశించకుండా వేగంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

స్నేహితుడు కనుమరుగయ్యేవరకు చూచి, నిట్టూర్చి లోపలికొచ్చాడు శ్యామ్. అతనికంతా కలలా వుంది. తలుపు కానుకొని నిల్చుని వుంది మాధవి.

"మధూ! అతను వెళ్ళిపోయాడు" ఆ స్వరంలో విచారమూ, నిస్సహాయత.

ఆమె నిర్వికారంగా అంది. "నాకు తెలుసు, అతను వెళ్ళిపోతాడని."

మోహన్ మాట్లాడకుండా వెళ్ళి రెండు చేతులతో తల పట్టుకుని సోఫాలో కూలబడ్డాడు. ఆమె నెమ్మదిగా అతని ప్రక్కకు చేరి అంది.

"బాధపడకు శ్యామూ!" అతను కళ్ళెత్తి జాలిగా ఆమెవంక చూశాడు. ఆ కళ్ళల్లో రెండు నీటి బిందువులున్నాయి. అవి ఆనంద భాష్పాలు. పోగొట్టుకున్నది దొరికిన భావావేశపు కన్నీటిరూపం.

అతను నిర్భయంగా ఆమె చేతిని అందుకున్నాడు.